RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

www.nityamnigha.com

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక


NITYAM NIGHA TELUGU DAILY

మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal

Circulated at : Telangana All Districts





వరంగల్ | సంపుటి 2 | సంచిక 77 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శుక్రవారం 18.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..



- ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్ వాడుతున్న ప్రధాని మోదీ
- యువతకు చేరువ-య్యేందుకు కొత్త కమ్యూనికేషన్ వ్యూహం
- 'ఫ్లెక్స్', 'ఫోమో', 'ఓజీ' వంటి పదాల వినియోగం
- ఎస్ఆర్సీసీ, ఇండియా-డెన్మార్క్ సదస్సుల్లో ఈ పదాల ప్రస్తావన
- యువ ఓటర్లను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా విశ్లేషణ

2

సిట్టింగ్ జడ్జితో విచారణకు
కేటీఆర్ సవాల్



- కేసీఆర్ ఆస్తులపై ఆరోపణలను ఖండించిన కేటీఆర్
- 67 ఎకరాల భూమిపై కేటీఆర్ వివరణ
- 933 ఎకరాలు ఉన్నట్లు నిరూపిస్తే రాసిస్తామని ప్రకటన
- రేవంత్ ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు

2

డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు..
త్రుటిలో తప్పిన ప్రమాదం



2

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు
ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూల్ విడుదల
- మహబూబ్‌నగర్, వరంగల్ నియోజకవర్గాలకు ఎన్నికల ప్రక్రియ
- సెప్టెంబర్ 20 నుంచి నవంబర్ 6 వరకు దరఖాస్తుల స్వీకరణ
- పాత ఓటర్లు కూడా మళ్లీ కొత్తగా నమోదు చేసుకోవాలని స్పష్టం
- డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా ప్రకటన



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్గొండ స్థానాలకు ఓటర్ల నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 20న ఓటర్ల నమోదుకు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేయనున్నారు. అప్పటి నుంచి నవంబర్ 6 వరకు అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు గడువు ఉంటుంది. వీటిని పరిష్కరించిన అనంతరం, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఒక కీలక విషయాన్ని స్పష్టం చేశారు. గతంలో పట్టభద్రుల ఓటరుగా పేరు నమోదు చేసుకున్న వారు కూడా తప్పనిసరిగా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పాత ఓటు రద్దవుతుందని, కొత్త జాబితాలో పేరు నమోదైతేనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. ప్రస్తుతం ఈ రెండు స్థానాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్సీలు వాణీదేవి, తీన్మార్ మల్లన్నల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నెలతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను ప్రారంభించింది.

కేటీఆర్ సిబ్బంది విచారణ: సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచండి.. పోలీసులకు హైకోర్టు ఆదేశం

- పోలీస్ స్టేషన్‌లో తమపై దాడికి యత్నించారని కేటీఆర్ సిబ్బంది ఆరోపణ
- తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి రక్షణ కల్పించాలని కోర్టు ఆదేశం
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ఉన్నతాధికారులకు నోటీసులు

నిత్యం నిఘా, హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైఫాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించి న కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.



2

ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు.. పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు



- బడా గణేశ్ ను దర్శించుకున్న హరీశ్, తలసాని, కాలేరు వెంకటేశ్
- ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలన్న హరీశ్ రావు
- నిమజ్జన ఘట్టంలో అప్రమత్తంగా ఉండాలని సూచన

2

కీసర పోలీస్ స్టేషన్‌లో లంచం బాగోతం..
ఏసీబీకి అడ్డంగా దొరికిన కీసర సీఐ, ఎస్ఐ



- రూ.5 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కీసర సీఐ, ఎస్ఐ
- స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్ చేసిన పోలీసులు
- ఏసీబీ వలకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన సబ్-ఇన్‌స్పెక్టర్

2

తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల తేదీలు ఇవే!

- తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షల తేదీలు విడుదల
- నవంబర్ 29న ఎస్ఐ, డిసెంబర్ 20న కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష
- మొత్తం 7,437 పోస్టులకు 5.77 లక్షలకు పైగా దరఖాస్తులు
- ఆధార్ ఫేస్ అథెంటికేషన్‌కు సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగింపు

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ లో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది నిరుద్యోగులకు కీలకమైన ప్రకటన వెలువడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రాథమిక రాత పరీక్ష (ప్రిలిమినరీ) తేదీలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి ఖరారు చేసింది. ఈ వివరాలను టీఎస్ఎల్‌పీఆర్బీ చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. షెడ్యూల్ ప్రకారం, ఎస్ఐ (SI) పోస్టులకు 2026 నవంబర్ 2న, కానిస్టేబుల్ పోస్టులకు 2026 డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత .....

2

కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై ప్రభుత్వ దృష్టి..
రంగంలోకి రెవెన్యూ అధికారులు

- కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై ప్రభుత్వం చర్యలు
- సమీపంలోని ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారుల ఆరా
- సర్వే నంబర్లు, పాత రికార్డుల సేకరణ
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ప్రకటనతో కదలిక

నిత్యం నిఘా, హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్ భూములపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఫామ్‌హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ భూముల సర్వే నంబర్లు, గతంలో ఆ భూములను సాగు చేసిన రైతుల పేర్లు, ప్రస్తుత భూ రికార్డుల వివరాలతో అధికారులు సమగ్ర నివేదికలను రూపొందిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ భూములపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు అనుగుణంగానే అధికారులు ఇప్పుడు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంపై దృష్టి పెట్టారు. కేసీఆర్ భూముల విస్తీర్ణం, వాటి స్వరూపంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం కొనసాగుతున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కేటీఆర్ సిబ్బంది విచారణ: సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచండి.. పోలీసులకు హైకోర్టు ఆదేశం

మొదటిపేజీ తరువాయి.. తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. ఓ కార్యక్రమానికి డీజే అనుమతి కోసం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇప్పటికే ఫిర్యాదు నమోదైందని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పిటిషనర్లు తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హోం సెక్రటరీ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఖైరతాబాద్ ఏసీపీలకు నోటీసులు జారీ చేసింది.

తెలంగాణ పోలీస్ నియామక పరీక్షల తేదీలు ఇవే!

మొదటిపేజీ తరువాయి.. పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF), అగ్నిమాపక, జైళ్ల శాఖల పరిధిలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ ఉద్యోగాలకు రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు కేవలం 28 రోజుల వ్యవధిలో మొత్తం 5,77,064 దరఖాస్తులు అందినట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక్కో అభ్యర్థి 1.34 పోస్టులకు దరఖాస్తు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దరఖాస్తుదారుల్లో 74.66 శాతం పురుషులు, 25.33 శాతం మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ అభ్యర్థులు 49.19 శాతం, ఎస్సీ/ఎస్టీలు 43.60 శాతం, ఓసీలు 7.20 శాతం చొప్పున ఉన్నారు.

డోర్నకల్ ఎమ్మెల్యే కారులో మంటలు.. తృటిలో తప్పిన ప్రమాదం

మొదటిపేజీ తరువాయి.. డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్ర నాయక్‌కు పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం రేగింది. ఈ ఘటనలో ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడగా, ఆయన కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఎమ్మెల్యే రాంచంద్ర నాయక్ మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరారు. మార్గమధ్యంలో చింతపల్లి వద్దకు రాగానే ఆయన కారులో నుంచి పొగలు రావడం మొదలైంది. కారులో ఉన్న పవర్ బ్యాంక్ పేలడంతో కేబిన్‌లో మంటలు వేగంగా వ్యాపించాయి. వెంటనే అప్రమత్తమైన ఎమ్మెల్యే, సిబ్బంది కారును నిలిపివేసి కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో డ్రైవర్ మాత్రం స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే మరో వాహనంలో మహబూబాబాద్ కలెక్టరేట్‌కు బయలుదేరి వెళ్లారు. తమ నాయకుడి కారులో మంటలు చెలరేగాయన్న వార్త తెలియడంతో నియోజకవర్గ ప్రజలు, అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన సురక్షితంగా ఉన్నారని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఖైరతాబాద్ గణపతికి ప్రత్యేక పూజలు చేసిన హరీశ్ రావు..

పర్యావరణహిత వేడుకలపై ప్రశంసలు

మొదటిపేజీ తరువాయి.. భాగ్యనగరం నడిబొడ్డున కొలువైన ప్రపంచ ప్రసిద్ధ ఖైరతాబాద్ పంచముఖ సంకట మహాగణపతిని బీజేపీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు దర్శించుకున్నారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సహా బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలిసి ఆయన స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ... చార్మినార్, గోల్కొండ కోటల మాదిరిగానే హైదరాబాద్ అంతర్జాతీయ బ్రాండ్ ఇమేజ్‌ను నలుదిశలా సగర్వంగా చాటడంలో ఖైరతాబాద్ వినాయకుడి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. కేవలం పరిమాణంలోనే కాక, భక్తుల నమ్మకంలోనూ ఇది 'బడియా గణేశ్'గా నిలిచిందని అభివర్ణించారు. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తులో పూర్తిగా మట్టితో రూపుదిద్దుకున్న పంచముఖ సంకట మహాగణపతిని ప్రతిష్ఠించి ఉత్సవ కమిటీ పర్యావరణ పరిరక్షణకు గొప్ప సందేశమిచ్చిందని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ పర్యావరణానికి ముప్పు లేని మట్టి వినాయకులనే పూజించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు ఉత్సవాలను ఎంత వైభవంగా నిర్వహిస్తున్నామో, నిమజ్జన ఘట్టంలోనూ అంతే అప్రమత్తత అవసరమని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల పటాన్‌చెరు పరిధిలో నిమజ్జనం సమయంలో చోటుచేసుకున్న విషాదకర సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా ముందస్తుగా ప్రభుత్వ యంత్రాంగం, ఉత్సవ సమితులు సమన్వయంతో పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు, భక్తులకు స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన కోరుకున్నారు.

మోదీ ప్రసంగాల్లో జెన్-జీ స్లాంగ్..

మొదటిపేజీ తరువాయి.. ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత (జెన్-జీ) ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ కళాశాల పూర్వ విద్యార్థులను 'ఓజీ' (OG)లుగా అభివర్ణించారు. జెన్-జీ పరిభాషలో 'ఓజీ' అంటే 'ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్' అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో 'ఫ్లెక్స్' (Flex) అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక 'ఫ్లెక్స్' లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని 'ఫ్లెక్స్' అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియా-డెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని 'ఫోమో' (FOMO) అనే పదాన్ని ప్రస్తావించారు. 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్' అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ 'ఫోమో'. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు 'ఫోమో'కు గురవుతారని చెప్పడానికి మోదీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు. ప్రధాని మోదీ ఈ తరహా పదాలను ఉపయోగించడం ఒక విస్తృత కమ్యూనికేషన్ వ్యూహంలో భాగమని విశ్లేషకులు భావిస్తున్నారు. సోషల్ మీడియా, ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ తరహా కంటెంట్‌తో యువతను ఆకట్టుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. సంప్రదాయ రాజకీయ ప్రసంగాలకు భిన్నంగా, మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను మలచుకుంటూ యువతరంతో మమేకం అయ్యేందుకు మోదీ చేస్తున్న ఈ ప్రయత్నం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీస్తోంది.

సిట్టింగ్ జడ్జితో విచారణకు కేటీఆర్ సవాల్

మొదటిపేజీ తరువాయి.. మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే కేసీఆర్, రేవంత్‌రెడ్డి ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని అన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీలో కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములపై రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ ఇన్నాళ్లూ ప్రచారం చేసి.. అసెంబ్లీలో మాత్రం 67 ఎకరాలు ఉన్నట్లు సీఎం చెప్పారని కేటీఆర్ అన్నారు. తప్పుడు ప్రచారం చేసినందుకు రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు 933 ఎకరాల భూమి ఉందని ప్రభుత్వం నిరూపిస్తే ఆ భూములను రాసిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై పుట్టుపూర్వోత్తరాలతో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. కేసీఆర్ భూస్వామ్య కుటుంబంలో పుట్టారని, తమ తాతకు వందల ఎకరాల భూమి ఉండేదని కేటీఆర్ చెప్పారు. ఇప్పుడు 67 ఎకరాలు ఉండటం తప్పా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రేవంత్‌రెడ్డి ఆస్తులపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. తాను అమెరికాలో ఉద్యోగం చేసి సంపాదించుకున్నానని చెబుతున్నా.. రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ లాంటి ఇల్లు, ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఆయన తమ్ముళ్లు ఏరోస్పేస్ కంపెనీలు ఎలా ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం అయ్యాక ఆయన చిన్నాన్న ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారో వివరించాలని కోరారు. రేవంత్‌రెడ్డి తమ పార్టీ నేతలపై ఇష్టానుసారంగా ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ప్రతి పథకంలోనూ స్కామ్ ఉంటోందని ఆరోపించారు.

కీసర పోలీస్ స్టేషన్‌లో లంచం బాగోతం..

- ఏసీబీకి అడ్డంగా దొరికిన కీసర సీఐ, ఎస్ఐ

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ఇద్దరు పోలీసు అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి చిక్కారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలోని కీసర పోలీస్ స్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. రూ.5 లక్షలు లంచం డిమాండ్ చేసి, స్వీకరించిన కేసులో సర్కిల్ ఇన్‌స్పెక్టర్/ఎస్‌హెచ్ఓ అర్కపల్లి ఆంజనేయులు, సబ్-ఇన్‌స్పెక్టర్ ద్యాప జ్ఞానేందర్ రెడ్డిని ఏసీబీ అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. ఒక కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు చేయడంతో పాటు బాధితుడిని, అతని స్నేహితుడిని ఇకపై వేధించకుండా ఉండేందుకు ఈ లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తమ ప్రకటనలో వెల్లడించింది. పోలీసుల వేధింపులు ఎక్కువవడంతో బాధితుడు నేరుగా ఏసీబీని ఆశ్రయించాడు. ముందుగా రూ.10 లక్షలు డిమాండ్ చేసిన పోలీసులు, చివరికి రూ.5 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. బాధితుడితో గత కొన్ని రోజులుగా నిందితులు బిర్యానీలు, కూల్ డ్రింకులు తెప్పించుకుని వేధించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో గణేష్ నిమజ్జన డ్యూటీలో ఉన్న ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి, కీసర చెరువు సమీపంలో ఒక కారులో రూ.5 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు సూచన మేరకే ఎస్ఐ ఈ డబ్బును స్వీకరించినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఏసీబీ అధికారులను చూసి తప్పించుకోవడానికి ప్రయత్నించినప్పటికీ, ఎస్ఐని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్ అనంతరం ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ ఇద్దరినీ అరెస్ట్ చేసిన ఏసీబీ, వారిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కీసర పోలీస్ స్టేషన్‌తో పాటు అధికారుల నివాసాల్లోనూ ఏసీబీ సోదాలు నిర్వహించింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్-ఫ్రీ నంబర్ 1064కు సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ ప్రజలకు సూచించింది.

గణేశ్ నిమజ్జనం: హైదరాబాద్‌లో పోలీసుల కవాతు..

- రంగంలోకి ఆర్ఏఎఫ్

నిత్యం నిఘా, హైదరాబాద్ : హైదరాబాద్‌లో గణేశ్ ఉత్సవాలు, సెప్టెంబర్ 25న జరగనున్న విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో నగర పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇందులో భాగంగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (RAF) సిబ్బందితో కలిసి గురువారం నగరంలోని పలు సున్నితమైన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. శాంతిభద్రతలను కాపాడటం, మత సామరస్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కవాతు చేపట్టారు. గోల్కొండ జోన్ డీసీపీ జె. రాఘవేందర్ రెడ్డి నేతృత్వంలో ఈ ఫ్లాగ్ మార్చ్ జరిగింది. గోషామహల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాల్లో ఈ కవాతు నిర్వహించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ నుంచి మొదలైన ఈ ఫ్లాగ్ మార్చ్.. పటేల్ నగర్, దారుస్సలాం, ఘోడే కీ ఖబర్, జుమ్మేరాత్ బజార్ టీ-జంక్షన్ మీదుగా సాగింది. స్థానిక పోలీసులతో పాటు ఆర్ఏఎఫ్ సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. పండుగ సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా చూసేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందని ఈ ఫ్లాగ్ మార్చ్ ద్వారా ప్రజలకు భరోసా కల్పించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు, ఊరేగింపులో పాల్గొనేవారు పోలీసుల నిబంధనలు, సూచనలను కచ్చితంగా పాటించాలని గోషామహల్ ఇన్‌స్పెక్టర్ బి. శ్రవణ్ కుమార్ తెలిపారు. పోలీసులు సూచించిన మార్గాల్లో, నిర్దేశిత సమయంలోనే ఊరేగింపులు జరపాలని, ట్రాఫిక్‌కు లేదా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలిగించవద్దని స్పష్టం చేశారు. గణేశ్ నిమజ్జనం రోజున హైదరాబాద్ వ్యాప్తంగా సుమారు 20,000 మంది పోలీసు సిబ్బందిని బందోబస్తు కోసం మోహరించనున్నారు. ఇటీవల పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ, ఇతర శాఖల అధికారులతో కలిసి బాలాపూర్ నుంచి ట్యాంక్ బండ్ వరకు 19 కిలోమీటర్ల నిమజ్జన మార్గాన్ని తనిఖీ చేశారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బీసీలకు సీట్లు కాదు.. రాజకీయ సీటు కావాలి..!

- జనరల్ స్థానాలు అందరివీ.. ఒక్క వర్గానికే ఎలా?
- అక్టోబర్‌లో పరకాలలో బీసీల బహిరంగ సభ..
- ఉమ్మడి వరంగల్‌లో 8 సభల నిర్వహణ

వరంగల్, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి) :

"బీసీలకు సంక్షేమ పథకాలు మాత్రమే కాకుండా రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు, అధికారంలో వాటా కల్పించాల్సిన అవసరం ఉందని ఓబీసీ ప్రెసిడెంట్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జనరల్ స్థానాలు అన్ని వర్గాల వారు పోటీ చేయగలిగినవేనని, అయితే ఆ స్థానాలు ఒకే వర్గానికి పరిమితమైనట్లుగా మారడం సరికాదన్నారు. డబ్బుతో ఓట్లను ప్రభావితం చేసే రాజకీయాలకు స్వస్తి పలికి, బీసీలు తమ ఓటు విలువను గుర్తించాల్సిన సమయం వచ్చిందన్నారు. డిజిటల్ మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సుందర్‌రాజ్ యాదవ్ తన రాజకీయ, విద్యా, సామాజిక ప్రస్థానంతో పాటు బీసీల హక్కులు, వరంగల్ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై మాట్లాడారు.


- సీట్లు దక్కే వరకు పోరాటం



బీసీలకు సంక్షేమ పథకాలు అందించడం మాత్రమే సామాజిక న్యాయం కాదని సుందర్‌రాజ్ యాదవ్ పేర్కొన్నారు. రాజకీయ అధికారం, చట్టసభల్లో ప్రాతినిధ్యం, పార్టీ పదవుల్లో సముచిత స్థానం, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన న్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో బీసీల ఓట్లు కోరుతూ, సీట్లు ఇచ్చే సమయంలో వారిని పక్కన పెట్టే విధానాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న డిమాండ్‌ను ఆయన ప్రస్తావించారు. ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తర్వాత మరో మాట చెప్పే రాజకీయాలకు ముగింపు పలకాలని అన్నారు. బీసీలకు న్యాయం జరిగే వరకు ఓబీసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, ఉద్యమాలు కొనసాగుతాయని తెలిపారు.

- జనరల్ అంటే అందరిదీ కాదా..?

జనరల్ స్థానాలు అన్ని కులాలు, వర్గాలకు చెందిన అభ్యర్థులు పోటీ చేసే అవకాశమున్న స్థానాలని సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. అయితే రిజర్వేషన్ లేని స్థానాల్లోనూ ఒకే వర్గానికి చెందిన అభ్యర్థుల పేర్లే ప్రధానంగా వినిపించడం పట్ల ప్రశ్నించారు. వరంగల్ మేయర్ స్థానం జనరల్‌గా మారినప్పుడు ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థుల పేర్ల చుట్టూనే చర్చ జరగడం ఏమిటని ప్రశ్నించారు. బీసీల్లో నాయకత్వం, సామర్థ్యం ఉన్నవారు లేరా? అని నిలదీశారు. ఈసారి వరంగల్ జనరల్ మేయర్ స్థానాన్ని బీసీలకు దక్కేలా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని తెలిపారు. డబ్బులు తీసుకుని ఓటు వేసే విధానాన్ని ఓటర్లు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. బీసీలు రాజకీయంగా ఏకమైతే జనరల్ స్థానాల్లోనూ తమ అభ్యర్థులను గెలిపించుకునే శక్తి వస్తుందని అన్నారు.



- పరకాలలో బీసీల బహిరంగ సభ

అక్టోబర్‌లో పరకాలలో బీసీల బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎనిమిది ప్రాంతాల్లో సభలు నిర్వహించి బీసీల రాజకీయ, సామాజిక హక్కులపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న బీసీలను కలుపుకుని ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని



తెలిపారు. బీసీలు ఏ పార్టీలో ఉన్నా ఎదుర్కొంటున్న సమస్యలు అనేక సందర్భాల్లో ఒకే విధంగా ఉంటాయని అన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే బీసీలను గుర్తు చేసుకునే విధానం మారాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటి నుంచి బీసీ హక్కులపై చర్చ మొదలుకావాలని, ప్రతి కుటుంబం తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

- ఉద్యోగాలు, విద్యపై ప్రత్యేక దృష్టి

బీసీ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు అక్టోబర్ 9న విద్యాశాఖ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి, విద్య, ఆరోగ్య రంగాల్లో అవకాశాలు కల్పించేందుకు కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. యువతకు కేవలం రాజకీయ నినాదాలు సరిపోవని, విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతను ఉద్యోగాలకు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

ఓసీలు తమకు శత్రువులు కాదని, అయితే బీసీలకు దక్కాల్సిన అవకాశాలను ఇతరులు ఆక్రమించకూడదన్నదే తమ డిమాండ్ అని స్పష్టం చేశారు.

- ఈడబ్ల్యూఎస్ ఆదాయ పరిమితిపై ప్రశ్న

బీసీలు, ఓసీలకు వర్తించే పేదరిక ఆదాయ పరిమితుల్లో తేడా ఎందుకు ఉందని సుందర్‌రాజ్ యాదవ్ ప్రశ్నించారు. బీసీల విషయంలో రూ.1.50 లక్షల ఆదాయ పరిమితి, ఓసీలకు రూ.8 లక్షల ఆదాయ పరిమితి ఉండటంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ విషయంలోనూ రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల బీసీల ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతోందన్నది తన అభిప్రాయమని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

- వరంగల్ అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక

వరంగల్ నగరానికి అభివృద్ధి అవకాశాలు విస్తారంగా ఉన్నాయని సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకునేందుకు స్పష్టమైన ప్రణాళిక, సమర్థవంతమైన అమలు అవసరమన్నారు. కుడా పరిధిలో మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండే ధరల్లో ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. నగర శివార్లలో అపార్ట్‌మెంట్లు నిర్మించి రూ.30 లక్షల లోపు ధరలకు అందిస్తే మధ్యతరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ప్రైవేట్ భూములతో పాటు ప్రభుత్వ స్థలాలను కూడా సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. సరైన ప్రణాళికతో పనిచేస్తే పశ్చిమ నియోజకవర్గానికి గణనీయమైన ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. కుడా ఆదాయంలో 75 శాతం స్థానికంగా ఖర్చు చేయాలనే నిబంధన ఉందని తెలిపారు.

- ఐటీ, పర్యాటక రంగాలపై దృష్టి

వరంగల్‌ను హైదరాబాద్ తర్వాత మరో ప్రధాన ఐటీ కేంద్రంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో గతంలో తాను పనిచేశానని సుందర్‌రాజ్ యాదవ్ తెలిపారు. అమెరికా పర్యటనలో 13 కంపెనీల ప్రతినిధులతో చర్చించి వరంగల్‌లో సంస్థల ఏర్పాటుకు ప్రయత్నించానన్నారు. మడికొండలో ఐటీ రంగానికి కేటాయించిన ప్రాంతం చుట్టూ పారిశ్రామిక కార్యకలాపాలు ఉండటంతో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని చెప్పారు. నగర కేంద్రంలోని ప్రభుత్వ స్థలాల్లో ఐటీ టవర్లు ఏర్పాటు చేసి సంస్థలకు కేటాయిస్తే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగేవని పేర్కొన్నారు. దేవునూరు గుట్టల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధికి ప్రణాళిక రూపొందించామని, పెద్దస్థాయి పర్యాటక ప్రాజెక్టును తీసుకురావాలనే ఆలోచన అప్పట్లో ఉందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూ సరుకు రవాణా కేంద్రం ఏర్పాటు చేస్తే వరంగల్ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

- తండ్రి స్ఫూర్తితో విద్యా ప్రస్థానం

1970 జనవరి 1న వడ్డేపల్లిలో జన్మించిన సుందర్‌రాజ్ యాదవ్ తన కుటుంబ నేపథ్యాన్ని కూడా వివరించారు. లక్ష్మీరాజం, వరలక్ష్మి దంపతులకు పది మంది సంతానం కాగా తానే చివరివాడినని తెలిపారు. తన తండ్రి ఎక్సైజ్ శాఖలో పనిచేసేవారని,



విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారని గుర్తుచేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఉన్నత విద్యను కొనసాగించానని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశానన్నారు. 1991లో రూ.1,200 మొదటి జీతంతో ఉద్యోగ జీవితం ప్రారంభించానని తెలిపారు. తండ్రి భీమారంలోని ఇల్లు విక్రయించి ఇచ్చిన రూ.1.50 లక్షలతో కంప్యూటర్ శిక్షణా కేంద్రానికి బీజం పడిందని, 1992లో మాస్టర్‌జీ ఇన్‌స్టిట్యూట్స్ ప్రారంభమైందని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ ప్రోత్సాహంతో విద్యా రంగంలో మరింతగా ముందుకు వెళ్లానన్నారు. 2001 నుంచే తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని, 2009 నుంచి మాస్టర్‌జీ వేదికగా ఉద్యమ సమావేశాలు నిర్వహించామని తెలిపారు. 2015, 2021లో ఎమ్మెల్సీ అవకాశాలు చేజారాయని, కుడా చైర్మన్, మేయర్ పదవుల విషయంలో హామీలు వచ్చినా అమలు కాలేదని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రజా జీవితం, బీసీ హక్కుల ఉద్యమం, వరంగల్ అభివృద్ధి కోసం తన ప్రయాణం కొనసాగుతుందని సుందర్‌రాజ్ యాదవ్ స్పష్టం చేశారు.

పేద విద్యార్థులకు 'బ్యాగ్స్.. నోట్‌బుక్స్' అండ

- **తాడ్వాయి మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో 400 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ**



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 17(నిత్యం నిఘా ప్రతినిధి): మారుమూల గ్రామాల్లోని పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు గ్రేస్ సర్వీస్ సొసైటీ–ఖమ్మం ఆధ్వర్యంలో 'బ్యాగ్స్.. నోట్‌బుక్స్' సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడ్వాయి మండలంలోని తాడ్వాయి, కాటాపూర్, గంగారం, దామరవాయి, నరసాపూర్, భూపతిపురం, పంబపురం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 400 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, నోట్‌బుక్స్‌తో పాటు అవసరమైన విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేశారు. కాటాపూర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి కాటాపూర్ సర్పంచ్ దిడ్డి మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలను పంపిణీ చేశారు. పాలకుర్తి బాబు ,ఉపసర్పంచ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మానేశ్వర్, ఉపాధ్యాయులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు విద్యా సామగ్రి అందించడం ద్వారా వారి చదువుకు కొంతమేర ఆర్థిక భారం తగ్గించడంతో పాటు విద్యాభ్యాసంపై ఆసక్తిని పెంచవచ్చన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆశయాలను నెరవేర్చేలా విద్యలో రాణించాలని సూచించారు. చదువుతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, మంచి నడవడికను అలవర్చుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమైన సహకారం అందించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించడం పట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల చదువుకు అండగా నిలుస్తున్న గ్రేస్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు బిషప్ మారినేని జాకబ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో గ్రేస్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు మురళీకృష్ణరెడ్డి, కల ప్రసాద్, ముర్రం రాజేష్, కంతి ముత్తయ్య, లక్ష్మణరావు, ఆదిశివ, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

- **గుంజపడుగు గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్**



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): పరిసరాల పరిశుభ్రతపై గ్రామంలోని ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గుంజపడుగు గ్రామ సర్పంచ్ దండేవేన సంధ్య బానేష్ కోరారు. గురువారం మంథని మండలం గుంజపడుగు గ్రామంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ చెత్తను వేర్వేరుగా సేకరించడం, వాటిని సరైన విధంగా పారవేయడం గురించి విద్యార్థులకు వివరించి నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు కూడా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత గ్రామంగా, స్వచ్ఛ గ్రామంగా గుంజపడుగును తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలక లక్ష్మి , దొడ్డిపట్ల శంకర్, దేవరకొండ పోచం, దేవళ్ల లక్ష్మి , పాఠశాల ఉపాధ్యాయులు శివలీల, గ్రామ కార్యదర్శి సతీష్ కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

హనుమకొండలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



హనుమకొండ, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): భారతీయ జనతా పార్టీ (బీజేపీ) హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సంతోష్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ కౌన్సిల్ మెంబర్ రావు పద్మతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జాతీయ జెండాకు వందనం సమర్పించిన అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంత ప్రజలు సాగించిన పోరాటాన్ని గుర్తుచేశారు. రజాకారుల దౌర్జన్యాలు, దోపిడీలు, అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని నిరంకుశ పాలన నుంచి విముక్తి చేసేందుకు పోరాడిన వారి త్యాగాలను నేటి తరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు పేర్కొన్నారు. చారిత్రక పోరాటాలు, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ భవిష్యత్ తరాలకు చరిత్రను అందించాలని పిలుపునిచ్చారు.

లింగాల గ్రామపంచాయతీలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ మాట్లాడుతూ గ్రామానికి సంబంధించిన సమస్యలను గ్రామపంచాయతీ స్థాయిలోనే పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. గ్రామపంచాయతీలో పరిష్కారం కాని సమస్యలను మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కారం పొందాలని ఆయన సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే ప్రజాపాలన దినోత్సవం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడెం రాజేష్, వార్డు సభ్యులు చాపల సురేష్, రంజిత్ కుమార్, ప్రకాష్, స్వరూప, గ్రామ పెద్దలు సుధాకర్, పెనక ప్రవీణ్, వెంకన్న, నరసయ్య, రాజు, భాస్కర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పోరాటానికి స్ఫూర్తి సర్దార్ పటేల్ - ఎర్రబెల్లి ప్రదీప్ రావు



వరంగల్ , సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వెంకట్రామ సర్కిల్ వద్ద భారత తొలి ఉప ప్రధానమంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి మాజీ మేయర్ తక్కలపల్లి రాజేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానాన్ని భారత యూనియన్‌లో విలీనం చేయడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర చారిత్రాత్మకమైనదని అన్నారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం సర్దార్ పటేల్ చేసిన సేవలు, చూపిన ధైర్యం, దృఢ సంకల్పం దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన చారిత్రక ఘట్టమని, నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరులు, ఉద్యమకారుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ సమైక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎర్రబెల్లి ప్రదీప్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, మార్టిన్ లూథర్, ఎరుకల రఘునారెడ్డి, ముండ్రాతి వెంకటేశ్వర్లు, అల్లి అజయ్, అంకాల జనార్దన్, బైరి హరీష్, కందుకూరి శ్రీనివాస్, ప్రవీణ్ తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు.



మంథని పట్టణ అభివృద్ధే శ్రీధర్ బాబు ధ్యేయం

- **రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా): మంథని పట్టణ అభివృద్ధే మంత్రి శ్రీధర్ బాబు ధ్యేయమని మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి తెలిపారు. గురువారం మంథని పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులను మున్సిపల్ కమిషనర్ మనోహర్‌తో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోతున్న బాధితులను సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పనులను ముందుకు తీసుకెళ్లాలని మంత్రి శ్రీధర్ బాబు సూచించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి పక్షపాత వైఖరికి తావు లేకుండా పారదర్శకంగా పనులు చేపట్టాలని మంత్రి సూచించినట్లు పేర్కొన్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోయిన వారికి నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రధాన మలుపుల వద్ద, అలాగే నాలుగు రోడ్ల కలిసే కూడళ్ల వద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా విస్తృతంగా ఉండేలా ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ పెంటరి రాజుతో పాటు గ్రామస్తులు మహావాది విజయ్ కుమార్, రంగి అమర్నాథ్, జక్కం రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు

హనుమకొండ, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ నగరంలోని చారిత్రాత్మక అదాలత్ కూడలి వద్ద ఉన్న అమరవీరుల స్థూపం ప్రాంగణంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజాప్రతినిధులు, అధికారులు స్థూపం వద్దకు చేరుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ శ్వేతతో పాటు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, శాసనమండలి సభ్యుడు బసవరాజు సారయ్య, కుడా చైర్మన్ గుండు సుధారాణి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, వారి త్యాగాలను స్మరించుకున్నారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంతో పాటు అమరవీరుల స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని పలువురు నాయకులు పేర్కొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరు

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యక్రమంలో పాల్గొని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు. అనంతరం జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. మంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమానికి స్థానిక ప్రజలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.



నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ఏటూరునాగారంలో ఉచిత మొబైల్ ఏఐ ఛెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్

- 80 మందికి పరీక్షలు.. ముగ్గురు అనుమానితులు జిల్లా కేంద్రానికి రిఫర్



ఏటూరునాగారం, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సూచనలతో జిల్లా క్షయ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌టీఈపీ) ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ ఏఐ ఆధారిత ఛెస్ట్ ఎక్స్‌రే స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ఏటూరునాగారం గ్రామపంచాయతీ పరిధిలోని అకల వారి గణపురం–3 ఉపకేంద్రంలో నిర్వహించారు.క్షయవ్యాధిని (టీబీ) ప్రారంభ దశలోనే గుర్తించి, అనుమానితులకు తదుపరి నిర్ధారణ పరీక్షలు, అవసరమైన వైద్య సేవలు అందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 80 మందికి ఉచిత మొబైల్ ఏఐ ఆధారిత ఛెస్ట్ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక స్క్రీనింగ్‌లో ముగ్గురు అనుమానితులను గుర్తించి, తదుపరి నిర్ధారణ పరీక్షలు, వైద్యపరమైన మూల్యాంకనం కోసం ములుగు జిల్లా కేంద్రానికి రిఫర్ చేసినట్లు అధికారులు తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్నవారు, ముఖ్యంగా రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య సిబ్బంది సూచించారు. టీబీ నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉచిత చికిత్స అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ చాముండేశ్వరి, సీహెచ్ఓ వేణుగోపాలకృష్ణ, హెచ్‌వీ గంగ, ఏఎన్ఎం గీత, హెచ్ఏ జైలు బాబు, సీహెచ్ నాగేశ్వరరావు, టీబీ ఎలైట్ ఇండియా ప్రతినిధి రాజు, ఎక్స్‌రే టెక్నీషియన్ సంతోష్, కమ్యూనిటీ మొబిలైజర్ విజయ్ కుమార్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి టీబీ అనుమానితులను త్వరగా గుర్తించడం, వారికి సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా క్షయరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా చెరుకుల ధర్మయ్య

- విద్యారంగంలో విశిష్ట సేవలకు గుర్తింపు



ఏటూరునాగారం, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఏటూరునాగారం మండలం ఎంపీపీఎస్ ఎక్కెల పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం చెరుకుల ధర్మయ్య జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై అవార్డు అందుకున్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపునకు ఆయన చేసిన విశేష కృషిని గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. చెరుకుల ధర్మయ్య గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 2011లోనే తొలిసారిగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం విశేషం. తాజాగా తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో విద్యారంగంలో ఆయన అందిస్తున్న సేవలకు మరోసారి గుర్తింపు లభించింది. ములుగు జిల్లా కేంద్రంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) సిద్ధార్థరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా చెరుకుల ధర్మయ్యకు శాలువా కప్పి, పుష్పమాలలు వేసి ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

కాకతీయ యూనివర్సిటీలో ఘనంగా ‘తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం’



హనుమకొండ, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ యూనివర్సిటీ (కేయూ) ప్రాంగణంలో ‘తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం’ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించి జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సాగుతున్న పాలన ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామ్‌రెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు, వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

- జెండా ఆవిష్కరించిన మార్కెట్ చైర్మన్ సుకినే సంతాజీ



హనుమకొండ /ఎల్కతుర్తి, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం జెండా వందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుకినే సంతాజీ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం రాష్ట్ర చరిత్రలో ప్రాధాన్యత కలిగిన రోజని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయం ప్రధాన ఆధారమని, రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు క్షేత్ర స్థాయిలో రైతులకు చేరేలా అందరూ సహకరించాలని కోరారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులు, మార్కెటింగ్ సౌకర్యాలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పన తదితర అంశాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీ ప్రతినిధులపై ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, డైరెక్టర్లు రాజయ్య, సుధాకర్, బాబురావు, ప్రవీణ్, ఎం. రాజయ్య, కొమురయ్య, వెంకట స్వామి, హకీం పాషా, జగన్, సింగిల్ విండో చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రైతులు, సొసైటీ సభ్యులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు.

మేచరాజుపల్లి పాఠశాలకు గర్వకారణం

మధూకర్ గౌడ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు





నెల్లికుదురు, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, బోధనా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న బొమ్మెర మధూకర్ గౌడ్‌కు అరుదైన గౌరవం దక్కింది. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జడ్పీహెచ్ఎస్ మేచరాజుపల్లి పాఠశాలలో సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బొమ్మెర మధూకర్ గౌడ్ ఎంపికయ్యారు.విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయడం, బోధనలో వినూత్న పద్ధతులను అవలంబించడం, పాఠశాల అభివృద్ధికి అంకితభావంతో పనిచేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయనను మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా నెల్లికుదురు మండల విద్యాశాఖ అధికారి రామదాసు చేతుల మీదుగా మధూకర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ప్రశంసా పత్రం, మెమెంటో, శాలువా అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా మధూకర్ గౌడ్ మాట్లాడుతూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడం తనపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.మధూకర్ గౌడ్‌కు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు..

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నిరుపేద దళిత కుటుంబంలో పుట్టిన మట్టిలో మాణిక్యం

- పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదంటూ వేడుకోలు
- 389 మార్కులతో ఎస్సీ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు
- సెప్టెంబర్ 19లోపు ఫీజు చెల్లింపు
- దాతల ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిని అఖిల కుటుంబం

వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): చదువు కోవాలన్న పట్టుదల.. ప్రతిభకు కొదవలేదు.. వైద్య విద్యను అభ్యసించి డాక్టర్ కావాలన్న లక్ష్యంతో ముందుకు సాగిన నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని అఖిలకు ఎంబీబీఎస్ సీటు లభించింది. అయితే సీటు సాధించిన ఆనందం ఎక్కువసేపు నిలవకముందే, అడ్మిషన్ కోసం అవసరమైన ఫీజు సమకూర్చుకోవడం కుటుంబానికి పెద్ద సవాలుగా మారింది.



వర్ధన్నపేటకు చెందిన మట్టి పని చేసుకుంటూ జీవనం సాగించే కొండేటి భాస్కర్, అనిత దంపతుల కుమార్తె అఖిల నీట్‌లో 389 మార్కులు సాధించి ఎస్సీ కేటగిరీలో ఎంబీబీఎస్ సీటు పొందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పటాన్‌చెరువులోని మెడికల్ కాలేజీలో ఆమెకు సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు.

అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు సెప్టెంబర్ 19 సాయంత్రం 4 గంటలలోపు ఫీజు చెల్లించాల్సి ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. రోజువారీ కూలీ పనులపై ఆధారపడి జీవించే కుటుంబానికి అవసర మైన ఫీజును సమకూర్చుకోవడం తీవ్ర ఆర్థిక భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క అవకాశం.. జీవితాన్ని మార్చే అవకాశం!

డాక్టర్ కావాలన్న అఖిల కలకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మార కూడదని కుటుంబ సభ్యులు, స్థానికులు కోరుతున్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థినికి దాతలు, సేవా సంస్థలు, మానవతావాదులు తమ వంతు సహాయం అందిస్తే ఆమె వైద్య విద్యను కొనసాగించే అవకాశం ఉంటుందని ఆశిస్తున్నారు.

"సీటు వచ్చింది.. ఇప్పుడు మా బిడ్డ చదువు ఆగిపోకుండా సాయం కోసం ఎదురుచూస్తున్నాం" అంటూ అఖిల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒక నిరుపేద కుటుంబానికి చేయూత.. ఒక విద్యార్థినికి భవిష్యత్తు.. సమాజానికి ఒక వైద్యురాలు!
అఖిల వైద్య విద్యకు సహాయం చేయాలనుకునే దాతలు ముందుకు వచ్చి తమకు అండగా నిలవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సహాయం చేయదలచిన వారు :
ఫోన్‌పే / గూగుల్‌పే: 9866452123

వైద్య ఖర్చుల భారంలో ఆపన్నహస్తం

- డెంగ్యూ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు రూ.55 వేల ఆర్థిక సాయం
- "భయపడొద్దు.. నేనున్నాను" అంటూ భరోసా
- అవసరమైతే మరింత సాయం చేస్తామని హామీ





వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన 11 ఏళ్ల మంద కార్తిక్ డెంగ్యూ జ్వరంతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో వైద్య ఖర్చులు భరించలేక ఆందోళనలో ఉన్న కుటుంబానికి ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ఆర్థిక సహాయం అందించారు. తన వంతు సహాయంగా రూ.55 వేల సాయం అందించి, చికిత్సకు మరింత ఖర్చు అవసరమైతే అదనపు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్తిక్ డాల్ఫిన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు ఆసుపత్రికి వెళ్లి వైద్యులను కలిశారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి, కొనసాగుతున్న చికిత్స, అవసరమైన వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహకారం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని, వైద్యం విషయంలో అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

రూ.55 వేల సాయంతో కుటుంబానికి ఊరట

వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ఎమ్మెల్యే స్పందించి రూ.55 వేల ఆర్థిక సహాయం అందించడం తమకు ఊరటనిచ్చిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని సహాయం చేసిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్కతుర్తిలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు



హనుమకొండ / ఎల్కతుర్తి, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా బీజేపీ నాయకులు తెలంగాణ విమోచన ఉద్యమ చరిత్రను గుర్తుచేశారు. నిజాం పాలనలో రజాకార్ల దౌర్జన్యాలు, ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో జరిగిన పోలీస్ చర్య 'ఆపరేషన్ పోలో' అనంతరం హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకున్నారు.తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, హక్కులు, ప్రజాస్వామ్య విలువల కోసం పోరాడిన అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు. యువత తెలంగాణ విమోచన చరిత్రను తెలుసుకోవడంతో పాటు భావితరాలకు చారిత్రక అంశాలను వివరించాలని నాయకులు సూచించారు.మోదీ జన్మదిన వేడుకలుఅనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ప్రజలకు, కార్యకర్తలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.శివాలయంలో ప్రత్యేక పూజలుతదుపరి ఎల్కతుర్తి శివాలయంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరేంద్ర మోదీ ఆయురారోగ్యాలతో ఉండాలని, దేశ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, దేశం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అల్లి కుమార్, చీదురాల వెంకటేష్, కుడుతాడి చిరంజీవి, పల్లెపాటి మధుకర్, అభిరు శ్రీనివాస్, వేల్పుల శ్రీనివాస్, కడారి ప్రసాద్, కానుకుంట్ల రమణాచారి, కోడం రమేష్, చిర శ్రీనివాస్, కంచర్ల శంకరయ్య, మూషిక వెంకటేష్, ఆడెపు శ్రీవర్ధన్, నాంపల్లి అశోక్, సల్వాల కిరణ్, దండ దేవేందర్ రెడ్డి, ఎడ్ల రఘోత్తం రెడ్డి, ఠాకూర్ శామ్ సింగ్, సుఖినే సుధాకర్, కొమ్మిడి లచ్చిరెడ్డి, మంతుర్తి



సమ్మయ్య, పోలు భిక్షపతి, ఉడుత సూర్యనారాయణ, మాజీ సర్పంచులు బూర్గుల రామారావు, భాస్కరరావు, కొమ్మిడి నిరంజన్ రెడ్డి, చల్ల రవీందర్ రెడ్డి, తక్కల్లపల్లి సంపత్ రావు, గణబోయిన నాగరాజు, పోలు నరేష్, చందా రామకృష్ణ, గొర్రె ప్రవీణ్, సాతూరి ప్రభాకర్, చీరాల రంజిత్, ఎన్. మాధవరావు, మాచర్ల తిరుపతి, నారెడ్ల శంకర్, సతీష్, నగేష్, కిరణ్, నమ్మిండ్ల ప్రవీణ్, సందేలా మధు, వడ్లకొండ రమేష్, గూడెం నాగరాజు, వెల్దండి రాజేందర్, పోలు శివ, జేయందర్, గూడెల్లి శ్రీనివాస్, బొజ్జ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.మహిళా మోర్చా నాయకులు మమత, స్వాతి, కడారి లక్ష్మి తో పాటు బీజేపీ శ్రేణులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మంథనిలో భక్తిశ్రద్ధలతో గణనాథుల దర్శనం

- పలు గణపతి మండపాలను సందర్శించిన మంత్రి శ్రీధర్ బాబు
- ప్రత్యేక పూజలు.. నిర్వాహకులతో ఆత్మీయంగా ముచ్చట



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు గురువారం మంథని పట్టణంలోని పలు గణపతి మండపాలను సందర్శించి గణనాథులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. మంథని పట్టణంలోని గణపతి దేవాలయ గణపతి, స్వర్ణకారుల గణపతి, రెడ్డి సంక్షేమ భవన్ గణపతి, మందాట యూత్ గణపతి మండపాలను మంత్రి సందర్శించారు. ఆయా మండపాల్లో గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు, భక్తులతో మంత్రి ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా స్వర్ణకారుల సంఘం, రెడ్డి సంక్షేమ భవన్ నిర్వాహకులు, మందాట యూత్ సభ్యులు మంత్రి శ్రీధర్ బాబును శాలువాలతో సన్మానించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహిస్తున్న నిర్వాహకులను మంత్రి అభినందించారు. మంథని ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

సూరారం గ్రామానికి తొలిసారి బస్సు సౌకర్యం

- **హర్షం వ్యక్తం చేసిన గ్రామ ప్రజలు.. మంత్రివర్యులకు కృతజ్ఞతలు**



హనుమకొండ /ఎల్కతుర్తి, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనలో భాగంగా సూరారం గ్రామానికి హనుమకొండకు తొలిసారిగా బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. గురువారం నుంచి బస్సు సర్వీసు ప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల రవాణా అవసరాలను గుర్తించి సూరారం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. బస్సు సర్వీసు అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళలు, వృద్ధులు, వ్యాపారులకు ప్రయోజనం కలగనుంది. హనుమకొండకు రాకపోకలు సులభతరం కావడంతో గ్రామ ప్రజల చిరకాల రవాణా సమస్యకు పరిష్కారం లభించినట్లైందని వారు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల రవాణా అవసరాలను గుర్తించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడంపై గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. సూరారం గ్రామాన్ని హనుమకొండతో మరింత చేరువ చేసినందుకు మంత్రి శ్రీధర్ బాబుకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు.

పంబాపూర్‌లో నూతన కాంగ్రెస్ యూత్ కమిటీ ఎన్నిక

- **నూతన కమిటీ అధ్యక్షుడిగా కుర్సం సాయికుమార్ ఎన్నిక**



ములుగు జిల్లా/తాడ్వాయి, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండలం పంబాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో పంబాపూర్ సర్పంచ్ ముక్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కాంగ్రెస్ యూత్ కమిటీని ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచనల మేరకు జిల్లా, మండల స్థాయి నాయకుల ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు.నూతన కమిటీ అధ్యక్షుడిగా కుర్సం సాయికుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎల్లబోయిన కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జబ్బ మహేష్, ప్రధాన కార్యదర్శిగా సుతారి సూర్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా ఎల్లబోయిన ప్రశాంత్, కార్యదర్శిగా కల్తీ ప్రవీణ్ ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా నర్సింగరావు, అధికార ప్రతినిధిగా మోహన్ రావు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కల్తీ ప్రకాష్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

- **బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరణ**

వరంగల్ /సంగెం, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): సంగెం మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నిజాం పాలన, రజాకారుల దాడులు, అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని, ప్రజలకు విముక్తి కల్పించేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చేపట్టిన చర్యలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబర్ 17కు ఉన్న ప్రాధాన్యతను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి దాసరి కుమార్ స్వామి, మండల ఉపాధ్యక్షుడు ఇటుకల కరుణాకర్, శక్తి కేంద్ర ఇన్‌చార్జి భోగ కోటేశ్వర్ గౌడ్, సెల్ కన్వీనర్ ఎల్లగౌడ్, తిమ్మాపురం అధ్యక్షుడు రమణాచారి, బీజేవైఎం మండల నాయకులు నాలం చంద్రశేఖర్, బెజ్జంకి రాజుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు సహకారం

- **రూ.300 మిలియన్ అమెరికన్ డాలర్ల రుణ ప్రతిపాదనపై కదలిక**
- **పార్కింగ్, రోప్‌వే, వర్షపు నీటి కాలువలు, పర్యాటకం, వారసత్వ పరిరక్షణ ప్రాజెక్టులపై చర్చ**



హనుమకొండ, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహకారంతో చేపట్టనున్న వివిధ ప్రాజెక్టులపై కసరత్తు ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం గురువారం వరంగల్ నగరంలో పర్యటించి, అభివృద్ధి పనులు చేపట్టనున్న ప్రాంతాలను పరిశీలించింది. అనంతరం హనుమకొండలోని కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులతో సమావేశమై ప్రతిపాదిత ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించింది. సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తేజావత్ వెంకన్నతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పూనం అహ్లువాలియా ఖనిజో, అపూర్వ సెన్వి, నేహా ప్రవాస్ కుమార్ మిశ్రా, వెంకటరావు భయాన సమావేశంలో పాల్గొన్నారు.

రూ.300 మిలియన్ డాలర్ల రుణ ప్రతిపాదన

తెలంగాణలో పట్టణ ప్రాంతాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 300 మిలియన్ అమెరికన్ డాలర్ల రుణానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు సమర్పించింది. దీనికి ప్రపంచ బ్యాంకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన నేపథ్యంలో ప్రతినిధుల బృందం వరంగల్‌లో పర్యటించింది. ఈ రుణంలో 70 శాతం ప్రపంచ బ్యాంకు రుణంగా, మిగిలిన 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఉండే విధంగా ప్రతిపాదన రూపొందించినట్లు అధికారులు వివరించారు. రుణం కింద చేపట్టేందుకు అర్హత కలిగిన ప్రాజెక్టులు, వాటి ప్రతిపాదనల రూపకల్పన, సమగ్ర ప్రాజెక్టు నివేదికల సమర్పణకు సంబంధించిన గడువులు తదితర అంశాలపై ప్రతినిధులు అధికారులతో చర్చించారు.

పలు కీలక ప్రాజెక్టులపై చర్చ

వరంగల్ నగరానికి సంబంధించి ఇప్పటికే సిద్ధంగా ఉన్న అభివృద్ధి ప్రతిపాదనలను అధికారులు ప్రపంచ బ్యాంకు బృందానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ముఖ్యంగా అశోక జంక్షన్, భద్రకాళి ఆలయ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల కార్ పార్కింగ్, సెంట్రల్ ప్లాజా పునర్నిర్మాణం, రోప్‌వే, సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి, సమగ్ర వర్షపు నీటి కాలువల వ్యవస్థ వంటి ప్రాజెక్టులను వివరించారు. ఇప్పటికే సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధమై, టెండర్లు పూర్తయి పురస్కార దశకు చేరుకున్న ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యం లభించే అవకాశం ఉందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. రెండో దశలో సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధమవుతున్న ప్రతిపాదనలను సమర్పిస్తే వాటిని పరిశీలించి అర్హత ఆధారంగా రుణ సహాయానికి పరిగణించే అవకాశం ఉందన్నారు.

వర్షపు నీటి కాలువల వ్యవస్థకు తొలి ప్రాధాన్యం

వరంగల్ నగరవ్యాప్తంగా సమగ్ర వర్షపు నీటి కాలువల వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ఇప్పటికే సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టును తొలి దశలోనే ప్రపంచ బ్యాంకు రుణ సహాయానికి ప్రతిపాదించే అవకాశం ఉందన్నారు. ఇతర ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కూడా త్వరితగతిన సిద్ధం చేసి తదుపరి దశలో సమర్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రపంచ బ్యాంకు ప్రతినిధులకు వివరించారు.

వారసత్వ నగరంగా వరంగల్‌కు అవకాశాలు

వరంగల్ చారిత్రక, వారసత్వ ప్రాధాన్యం కలిగిన నగరమని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు పేర్కొన్నారు. హెరిటేజ్, పర్యాటక రంగాల అభివృద్ధికి నగరంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. చారిత్రక ప్రాంతాలను పరిరక్షిస్తూ పర్యాటక, మౌలిక వసతులను అభివృద్ధి చేసే విధంగా ప్రాజెక్టులను రూపొందించాలని సూచించారు. వారసత్వ ప్రాజెక్టుల పరిధిలో చేపట్టాల్సిన పనులు, వాటిలో చేర్చాల్సిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రపంచ బ్యాంకు మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేసి సమర్పిస్తే వరంగల్‌లో మౌలిక వసతులు, రవాణా, డ్రైనేజీ, పర్యాటకం, వారసత్వ పరిరక్షణ, పట్టణ సుందరీకరణ రంగాల్లో అభివృద్ధికి మరింత అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, కన్సల్టెంట్ ప్రతినిధి ఆనంద్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారి హుండీ ఆదాయం రూ.72.30 లక్షలు

- **ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి**
- **హుండీ లెక్కింపులో విదేశీ కరెన్సీ కూడా.. కెనరా బ్యాంకులో జమ చేసిన అధికారులు**



వరంగల్, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):
వరంగల్ మహానగరంలోని చరిత్ర ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో హుండీలను విప్పి లెక్కింపు నిర్వహించగా రూ.72,30,387 ఆదాయం సమకూరింది. హుండీ ద్వారా వచ్చిన మొత్తాన్ని హనుమకొండ కెనరా బ్యాంకు శాఖలో జమ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత తెలిపారు. హుండీ లెక్కింపులో విదేశీ కరెన్సీ కూడా లభించింది. 628 అమెరికా డాలర్లు, 5 కెనడా డాలర్లు, 110 యూఏఈ దిర్హామ్‌లు, 10 బ్రిటిష్ పౌండ్లు, 60 అరేబియా ద్రవ్యాధికార సంస్థకు చెందిన కరెన్సీ, 10 యూరోలు లభించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. హుండీలో లభించిన మిశ్రమ బంగారం, వెండిని తిరిగి హుండీలోనే వేయనున్నట్లు తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న గద్వాల విజయలక్ష్మి

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి గురువారం ఉదయం శ్రీ భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ ఈవో, ప్రధానార్చకులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రాలను బహూకరించారు. అనంతరం ప్రసాదాలను అందజేశారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ వరంగల్ జిల్లా పరిశీలకులు ఎన్.కవిత, ఆలయ ఈవో, ఏసీ రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషు పర్యవేక్షించారు. శ్రీ లక్ష్మి శ్రీనివాస సేవా ట్రస్ట్ అధ్యక్షుడు జి.కృష్ణారెడ్డి, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి అధ్యక్షుడు జి.నవీన్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది సభ్యులు, ఆలయ సిబ్బంది హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ఎస్ఐలుగా ప్రమోషన్ పొందిన అధికారులకు సీపీ అభినందనలు

- **వరంగల్ సీపీ ఎన్.శ్వేతను మర్యాద పూర్వకంగా కలిసిన అధికారులు**



వరంగల్, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇపోలీస్ శాఖలో సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన అధికారులు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పి.సదానందం, డి.మోహన్‌రావు, బి.రమేష్, ఎం.రవీందర్‌రెడ్డి, పి.పాపయ్యలను సీపీ అభినందించారు. పదోన్నతి ద్వారా పెరిగిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలని సీపీ ఎన్.శ్వేత అధికారులకు సూచించారు

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

విఘ్నేశ్వర స్వామి కృపతో జమ్మికుంట ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- **ప్రత్యేక హోమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**



కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో శ్రీ విఘ్నేశ్వర స్వామి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విఘ్నేశ్వర స్వామి కృపాకటాక్షాలతో జమ్మికుంట పట్టణ ప్రజలకు సకల విఘ్నాలు తొలగి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా పట్టణ ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, కార్మికులతో కలిసి నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో చైర్మన్ స్వయంగా వడ్డించారు. సిబ్బంది, కార్మికులతో ఆత్మీయంగా మమేకమై కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, కౌన్సిలర్లు, మేనేజర్ గుర్రాల రాజిరెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇల్లందుల రమేష్, వేదపండితులు బ్రహ్మశ్రీ మండలేముల కపర్ది శర్మ, దుర్గా అయ్యగారు, మున్సిపల్ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- **వరంగల్‌లో నల్లకండువాలతో ఉద్యమకారుల ధర్నా**
- **హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని కన్వీనర్ మరుపల్ల రవి ఆరోపణ**



వరంగల్, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వరంగల్ ఉమ్మడి జిల్లాల ఉద్యమకారుల సంఘం కన్వీనర్ మరుపల్ల రవి డిమాండ్ చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా శివనగర్‌లోని ఖిలా వరంగల్ మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఉద్యమకారులు నల్లకండువాలు ధరించి ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా "ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి", "కమిటీలు వద్దు.. హామీలు నెరవేర్చాలి" అంటూ నినాదాలు చేశారు.ధర్నాలో మరుపల్ల రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారం కోసం కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసలైన ఉద్యమకారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల పెన్షన్ ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఉద్యమకారులు మండల రెవెన్యూ కార్యాలయ ఆర్ఐ వరుణ్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ఉద్యమకారులు నాగవెల్లి సాంబయ్య, మేకల ఎల్లయ్య, శంకేసి లింగమూర్తి, అంకం దేవానంద్, కెంచ ఆనంద్, కోరే సుభాష్, అయిత ప్రభాకర్, సోమ మధుకర్, బొరిశెట్టి సదానందం, బొల్లె కుమార్ స్వామి, మాడిశెట్టి రాజ్‌కుమార్, తాళ్లపల్లి శ్రీనివాస్, కళ్యాణ వెంకటేశ్వర్లు, అనుమాండ్ల శ్రీధర్, నేల మల్లమ్మ, ఆవునూరి లక్షి , ముసినిపల్లి జమున, కొడిపాక రమాదేవి, పల్లకొండ యాకలక్షి , చిదురాల సుజాత, సోమ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హరేకృష్ణ ఫౌండేషన్ అల్పాహారం

- **షకాహారం అందించడమే లక్ష్యం.....**
- **అభినందించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు**



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): విద్యార్థుల ఆరోగ్యం, విద్యతో పాటు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమనే ఉద్దేశంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గంగాపురి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గంగాపురి 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్పాహారం అందించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. చిన్నారులకు పోషకాహారం అందించాలనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం ద్వారా సమాజంలో సేవాభావం మరింత పెరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పేర్కొన్నారు. హరేకృష్ణ ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను వారు అభినందించారు.కార్యక్రమంలో గంగాపురి గ్రామ ప్రజలు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు పతాక వందనం

- **వర్ధన్నపేటలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు**
- **జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు**



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట లోని ప్రభుత్వ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాపాలన స్ఫూర్తిని చాటుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు జెండాను ఆవిష్కరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయసాగర్, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకట రమణ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ప్రజల సంక్షేమం, ప్రభుత్వ సేవల సమర్థవంతమైన అమలుకు సమన్వయంతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మేడారంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

- **తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం**





ములుగు జిల్లా / తాడ్వాయి, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడ్వాయి మండలం మేడారం గ్రామంలోని సమ్మక్క–సారక్కల కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు, ములుగు జిల్లా పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు సూచనలతో మండల అధ్యక్షుడు దండగల మల్లయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దండగల మల్లయ్య మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గిరిజనుల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి పలు చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకున్న ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. గిరిజన గ్రామాలను గూడేలుగా, లంబాడీ గ్రామాలను తండాలుగా గుర్తించడంతో పాటు, పోడు భూములకు పట్టాలు ఇచ్చి గిరిజనులకు హక్కులు కల్పించారని తెలిపారు.తాడ్వాయి మండల అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేపట్టిన కార్యక్రమాలే కారణమని మల్లయ్య పేర్కొన్నారు.మాజీ జెడ్పీటీసీ రామసాయం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. గత ప్రభుత్వం హయాంలో శంకుస్థాపనలు చేసిన పనులకే ప్రారంభోత్సవాలు నిర్వహిస్తూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దండగల మల్లయ్య, మాజీ జెడ్పీటీసీ రామసాయం శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివరాజ్, సీనియర్ నాయకులు పత్తి గోపాల్ రెడ్డి, వసంతరావు, మాజీ సర్పంచ్ చీడం బాబురావు, మాజీ మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాక లింగన్న, రఫీక్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసు ఉద్యోగార్థులకు స్క్రీనింగ్ టెస్ట్

- **ఉచిత పోలీసు ఉద్యోగ కోచింగ్ కోసం సెప్టెంబర్ 20న పరీక్ష**
- **వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో ఐదు కేంద్రాల్లో నిర్వహణ**



వరంగల్, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత కోచింగ్ అందించేందుకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల సహకారంతో వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలకు చెందిన ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సెప్టెంబర్ 20న పరీక్ష

సెప్టెంబర్ 20, ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ పరీక్షలో పాల్గొనదలిచిన అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకునేందుకు ప్రత్యేకంగా గూగుల్ ఫారం అందుబాటులో ఉంచారు.
అభ్యర్థుల నమోదు ఫారం
ఐదు కేంద్రాల్లో పరీక్ష
స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించే కేంద్రాలు:

1. వరంగల్ – సీకేఎం కళాశాల, దేశాయిపేట
2. హనుమకొండ – ఎస్‌వీఎస్ కళాశాల, రామారం
3. జనగామ – సీజేఐటీ ఇంజినీరింగ్ కళాశాల, యశ్వంతపూర్ క్రాస్ రోడ్
4. పరకాల – ప్రభుత్వ జూనియర్ కళాశాల
5. నర్సంపేట – బిట్స్ కళాశాల, లక్నేపల్లి

పోలీసు ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

- వీరుల త్యాగాలను స్మరించుకోవాలి : బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని వర్ధన్నపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అడుప రాజు మాట్లాడుతూ తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛ కోసం పోరాడిన మహనీయుల సేవలను నేటి తరం గుర్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణ చరిత్ర, విమోచన ఉద్యమ విశేషాలను యువతకు తెలియజేయాలని అన్నారు. ప్రజాసేవా కార్యక్రమాల్లో బీజేపీ కార్యకర్తలు నిరంతరం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు మైస రాము, నాంపల్లి యాకయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మహంత్, సోమిరెడ్డి, పెద్దూరి రాజు, మల్లెపాక అనిల్, పంజా వెంకన్న, సట్ల అనిల్, గోపి, శ్రీధర్, రాము, సుంకరి బాబు, మణిదీప్, సంపత్, కాలువ రాజు, కార్తీక్, రాకేష్, హరీష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేవంత్ భూ ఆరోపణలను ఖండించిన ఎర్రబెల్లి

- ఆధారాలు చూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- భూ వ్యవహారాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్



జనగామ జిల్లా , సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి): అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తనపై చేసిన భూ ఆరోపణలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు ఖండించారు. తాను భూ కబ్జాలకు పాల్పడినట్లు ఆధారాలతో నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేశారు. భూ వ్యవహారాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 16న తెలంగాణ అసెంబ్లీలో భూముల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు, వారి కుటుంబాలకు సంబంధించిన భూములపై పలు ఆరోపణలు చేశారు. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిధిలోని భూములపై విచారణకు కూడా ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పందిస్తూ తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపాలని కోరారు.

ఆధారాలు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

తాను భూ కబ్జాలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తమ కుటుంబానికి వారసత్వంగా వచ్చిన భూములను విక్రయించి రాజకీయాలు చేశామని, భూ కబ్జాలకు పాల్పడలేదని ఆయన పేర్కొన్నారు. తనతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారందరి భూ వ్యవహారాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలోనే భూ వ్యవహారాలపై సమగ్ర చర్చకు అవకాశం కల్పించాలని కోరారు.

రాజకీయ ఆరోపణలపై తీవ్ర స్పందన

అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకుని బెదిరింపులకు పాల్పడితే ప్రజల్లోనే దీనిపై స్పందన వస్తుందని ఎర్రబెల్లి అన్నారు. తనపై, బీఆర్ఎస్ నేతలపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరికాదని పేర్కొన్నారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలు భూ వ్యవహారాలపై ప్రశ్నిస్తారనే కారణంతోనే వారిని సభకు రాకుండా చేసే ప్రయత్నాలు జరిగాయని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్ర ఆధారాలను ఆయన సమర్పించలేదు.

కేసీఆర్‌పై వ్యాఖ్యలకు స్పందన

మాజీ సీఎం కేసీఆర్ గురించి మాట్లాడే నైతిక అర్హత రేవంత్‌రెడ్డికి లేదని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ పదవులకు రాజీనామా చేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తమ పార్టీ నాయకులు కూడా పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధపడ్డారని తెలిపారు. ప్రభుత్వం తమపై చేస్తున్న ఆరోపణలను రాజకీయంగా ఎదుర్కొంటామని, భూముల విషయంలో నిజానిజాలు తేలాలంటే స్వతంత్ర విచారణ జరగాల్సిందేనని ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ‘స్వచ్ఛతా హి సేవ–2026’
- ప్రచార పోస్టర్, బ్యానర్ ఆవిష్కరణ.. ప్రత్యేక సెల్ఫీ పాయింట్ ప్రారంభం



ములుగు జిల్లా , సెప్టెంబర్ 17 (నిత్యం నిఘా ప్రతినిధి):
పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా స్వీకరించి స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు ములుగు జిల్లావ్యాప్తంగా ‘స్వచ్ఛతా హి సేవ–2026’ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.
గురువారం ములుగు నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో నిర్వహించిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి స్వచ్ఛతా హి సేవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రచార పోస్టర్, బ్యానర్‌ను ఆవిష్కరించి ప్రత్యేక సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభించారు.

ప్రతి పౌరుడి బాధ్యత

మహాత్మా గాంధీ కలలుగన్న పరిశుభ్రమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. గ్రామాలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడం పారిశుధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా భాగస్వామి కావాలని సూచించారు.
ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, న్యాయస్థానాల ఆదేశాలకు అనుగుణంగా ప్రతి ఇంటిలో ఉత్పత్తయ్యే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. ఇంటివద్దే సేంద్రియ ఎరువు తయారీ, చెత్త వేర్పాటు, గ్రామ పంచాయతీల్లోని చెత్త వేర్పాటు కేంద్రాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల నుంచే మార్పు

మార్పు విద్యార్థుల నుంచే ప్రారంభం కావాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 17, 18 తేదీల్లో పాఠశాలల్లో పరిశుభ్రత, చెత్త వేర్పాటుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. సెప్టెంబర్ 19, 20 తేదీల్లో గ్రామాల్లో చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 21, 22 తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, సామూహిక మరుగుదొడ్లు, ప్రార్థనా స్థలాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులు

ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని మంత్రి కోరారు. వాటికి ప్రత్యామ్నాయంగా జనపనార, వస్త్ర సంచులను వినియోగించాలని సూచించారు. సెప్టెంబర్ 23, 24 తేదీల్లో ఇంటివద్ద సేంద్రియ ఎరువు, చెత్త వేర్పాటు, వర్మీ కంపోస్టు తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వినాయక మండపాల వద్ద ఉత్పత్తయ్యే పూలు, ఆకులు తదితర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి వర్మీ కంపోస్టు తయారీకి వినియోగించాలని సూచించారు. ఉత్సవాల్లో చెత్త ఉత్పత్తిని తగ్గించి వ్యర్థ రహిత వేడుకలు నిర్వహించేలా నిర్వాహకులను ప్రోత్సహించాలని అన్నారు.

అక్టోబర్ 2 వరకు విస్తృత కార్యక్రమాలు

అక్టోబర్ 2 వరకు రూపొందించిన రోజువారీ కార్యాచరణ ప్రకారం జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో స్వచ్ఛత కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాలు, యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల భాగస్వామ్యంతో ‘స్వచ్ఛతా హి సేవ–2026’ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్‌జీ, సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్డీవో కృష్ణవేణి, డీఆర్వో, మున్సిపల్ వైస్ చైర్మన్, డీఆర్‌డీఓ రవీందర్, ఎన్‌బీఎం జిల్లా సమన్వయకర్తలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉద్యోగులు, విద్యార్థులు, వయోవృద్ధులు, ప్రజలు పాల్గొన్నారు.

తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి



నిత్యం నిఘా, హయత్ నగర్, సెప్టెంబర్ 17 :
తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హైకోర్టు కాలనీ డివిజన్‌లోని శాంతినగర్ చౌరస్తా మరియు భూలక్ష్మి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విమోచన దినోత్సవ వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ:“తెలంగాణ విమోచన కోసం పోరాడిన వీరుల త్యాగాలను మనమందరం స్మరించుకోవాలి. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అమరవీరుల త్యాగాలు, ధైర్యం మనకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించుకోవాలి. మన చరిత్రను, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్ రెడ్డి , హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, హైకోర్ కాలనీ డివిజన్ అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింహా, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్,డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, మహిళా నాయకులు పార్వతి, సుజాత, డివిజన్ మహిళా అధ్యక్షురాలు గీత, నాయకులు సైదమ్మా, నాయకులు జనార్దన్, లక్ష్మణ్, జంగా రెడ్డి, విష్ణు,బాలు,భరత్, హిరితిక్ ,మరియు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాల ఫలితమే నేటి ప్రజా పాలన

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నిత్యం నిఘా, షాద్‌నగర్, సెప్టెంబర్ 17 :
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులకు నివాళులర్పిస్తూ షాద్‌నగర్ నియోజకవర్గంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మండల కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో, తెలంగాణ జేఏసీ ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో వేలాది మంది అమరులయ్యారని తెలిపారు. వారి త్యాగాల ఫలితంగానే నిజాం పాలన అంతమైందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఐక్యంగా పోరాడి హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనానికి మార్గం సుగమం చేశారని గుర్తుచేశారు.తెలంగాణ జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను ప్రజా పోరాట దినంగా గుర్తించాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీవో సరిత, ఎంపీడీవో శ్రీకాంత్, తహసీల్దార్ నాగయ్య, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందమోహన్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, కాంగ్రెస్, జేఏసీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.